
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 18.8

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 22 నవంబరు 2024



యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

ఆలయానికి చేరిన బంగారు తాపడం రేకులు

7



ధరణి లీలలు కోకొల్లలు

- వెలుగులోకి వస్తున్న తప్పిదాలు
- నల్లగొండ తహసీల్దార్ కార్యాలయం వేదికగా మరో రెండు ఫిర్యాదులు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురి డిమాండ్

ధరణి వెబ్‌సైట్ అమల్లోకి వచ్చాక తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లలో జరుగుతున్న లోపాలు ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి. ధరణి వచ్చాక వ్యవసాయభూముల రిజిస్ట్రేషన్ల బాధ్యతలను ప్రభుత్వం తహసీల్దార్లకు అప్పగించింది. తహసీల్దార్ లేని రోజుల్లో డిప్యూటీ తహసీల్దార్ రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నా, పలు సమస్యలు, తప్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా భూముల విలువలు పెరగడం, వారసులు, భాగస్వాముల మధ్య విభేదాల కారణంగా కొందరు తప్పుడు మార్గాల్లో ఆస్తులను కాజేయాలని చూస్తున్నారు. అందుకు తహసీల్ కార్యాలయాల్లో అమ్యామ్యాల ముసుగులో మద్దతు లభిస్తుండడంతో అమాయకులకు అన్యాయం జరుగుతోంది. విషయాలు వెలుగులోకి వచ్చాక మళ్లీ విచారణలు, ఫోరెన్సిక్ నివేదికలంటూ కాలయాపనతో పాటు డబ్బు ఖర్చవుతోందని బాధితులు వాపోతున్నారు.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

నల్లగొండ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉన్న మెజార్టీ పల్లెలు పట్టణ వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి. భూముల విలువ కోట్ల రూపాయలకు చేరడంతో తహసీల్ కార్యాలయం వేదికగా పలు వరుస తప్పిదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ పాలన గాడితప్పిందని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు.

చర్లపల్లి రెవెన్యూ గ్రామంలో రెండు రిజిస్ట్రేషన్లు అక్రమం?

చర్లపల్లి రెవెన్యూ గ్రామపరిధిలో వారసుల పేరున జరిగిన రెండు రిజిస్ట్రేషన్లు (సక్సెషన్లు) అక్రమమని బాధితులు ఫిర్యాదులు చేశారు. సర్వేనెంబర్ 631/అ లో 3.09 ఎకరాల భూమిని సుంకరబోయిన మునలయ్య పేరు నుంచి సుంకరబోయిన మల్లమ్మ పేరుకు మార్పిడి చేశారు. మునలయ్యకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. అయితే పెద్దకుమారుడు మృతిచెందగా, అతడి భార్య మల్లమ్మ పేరున ఈ ఏడాది సెప్టెంబరు 27న సర్వేనెంబర్ 631/అ లోని భూమి రిజిస్ట్రేషన్ చేశారు. నిబంధనల ప్రకారం ఈ రిజిస్ట్రేషన్ కావాలంటే మిగిలిన భాగస్వాముల అంగీకారం తెలపాలి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ నెంబర్లు సహా తహసీల్దార్ కార్యాలయానికి సమర్పించాలి. కాగా, ఈ రిజిస్ట్రేషన్‌లో అలాంటి పత్రాలేవీ జతపరచలేదు. పైగా మిగిలిన భాగస్వాములు గంగయ్య, వెంకన్న, మంగమ్మ తాము సంతకాలు చేయలేదని, ఫోర్జరీ చేశారని పేర్కొంటూ కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన మరో భూయజమాని మందడి పాపిరెడ్డికి చెందిన సర్వేనెంబర్లు 178/లూ, 181/ఆ, 343, 347/ఆ, 349/ఆ, 351/ఆ, 517/ఏలోని 3.25 ఎకరాల భూమిని అతడి కుమారుడు జితేందర్‌రెడ్డి పేరున 2022, జూన్ 6న రిజిస్ట్రేషన్ చేశారు. ఈ రిజిస్ట్రేషన్‌లో కూడా నిబంధనలు పాటించలేదు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో పాటు, ఇతర భాగస్వాముల వాంగ్మూలం నమోదు చేయలేదు. అయితే ఇక్కడ గిర్దావర్ ఇచ్చిన నివేదిక ప్రకారం

– మిగతా 8వ పేజీలో...

కళాశాలలో పోస్ట్ మాయం

- అధికారుల తప్పిదమా? బోర్డు మాయనా?
- సిలబస్ పూర్తికావడం లేదని విద్యార్థుల ఆందోళన



హాలియా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో హాలియాలో మూడున్నర దశాబ్దాల క్రితం మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి హయాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమైంది. నాడు కళాశాలలో బోధించే అన్ని సబ్జెక్టుల అధ్యాపకుల పోస్టులు మంజూరయ్యాయి. అయితే నాటి నుంచి మంజూరై ఉన్న గణితం లెక్చరర్ పోస్టు ఇటీవల అకస్మాత్తుగా నాన్‌సాంక్షన్ లిస్ట్‌లోకి చేరింది. ఇది అధికారుల తప్పిదమా? లేక ఇంటర్ బోర్డు తీసుకున్న నిర్ణయా? అనేది తెలియకపోగా, ఇక్కడ ఎంపీసీ గ్రూప్‌లో విద్యాభ్యాసం చేస్తున్న 118 మంది విద్యార్థులకు శాపంగా మారింది. కళాశాల వెబ్‌సైట్‌లో పోస్టు కనిపించకపోవడంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో గెస్ట్ లెక్చరర్‌ను నియమించే అవకాశం కూడా లేకుండాపోయింది. మూడేళ్లుగా ఇక్కడ మ్యాథ్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టు లేకుండాపోయింది. దీంతో విద్యార్థులు ఆందోళన చెందడంతో ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు ఇక్కడి నుంచి నార్కట్‌పల్లికి వెళ్లిన మ్యాథ్స్ గెస్ట్ లెక్చరర్‌ను వారానికి రెండు రోజులు ఇక్కడ బోధించేందుకు పంపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కీలకంగా ఉన్న మ్యాథ్స్ సబ్జెక్టును రెండు రోజులు బోధిస్తే సిలబస్ ఎలా పూర్తవుతుందని, వార్షిక పరీక్షలు రాసేదెలా అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మరో వైపు ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఎంపీసీ గ్రూప్ విద్యార్థులకు రెండు సబ్జెక్టులు మ్యాథ్స్ ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఇక్కడ పోస్టే లేకుండాపోగా, ఇక ఎంసెట్ కోచింగ్ ఎలా అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవచూపాలని కోరుతున్నారు.

గణితం రోజూ బోధించాలి



ఎంపీసీ గ్రూప్‌లో కీలకంగా ఉన్న గణితం సబ్జెక్ట్ బోధించే లెక్చరర్ లేరు. ప్రతీ రోజు బోధిస్తే పోటీ పరీక్షలకు, వార్షిక పరీక్షలకు ఉపయోగకరంగా ఉంటుంది. సిలబస్ ఎక్కువగా ఉండి వారంలో కేవలం రెండు రోజులు బోధించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– నందిని, విద్యార్థిని, ఎంపీసీ గ్రూప్

వారంలో రెండు రోజులు గణితం బోధన



కళాశాలలో గణితం లెక్చరర్ లేకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచరం ఇచ్చాం. వారి ఆదేశాల మేరకు నార్కెట్‌పల్లి కళాశాలలో పని చేస్తున్న గణితం గెస్ట్ లెక్చరర్‌ను వారానికి రెండు రోజులు ఇక్కడికి రప్పించి విద్యార్థులకు బోధిస్తున్నాం.

– జాకీర్ హుస్సేన్, ప్రిన్సిపాల్

న్యూస్ బాక్స్

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

టాస్క్‌ఫోర్స్ అధికారి రాజేష్



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం అధికారి ఎ.రాజేష్

చిట్యాలరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారి ఎ.రాజేష్ అన్నారు. గురువారం చిట్యాల మండలం వెలిమినేడు శివారులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ల్యాబ్, మందుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం ఉండకూడదన్నారు. ఔషధాల భద్రత ఎంతో ముఖ్యమన్నారు. ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

అందుకు ఆసుపత్రుల నిర్వహణ కీలకమన్నారు. వైద్యాధికారులు, ఇన్‌చార్జీలు ఎప్పటికప్పుడు ఆసుపత్రులను నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.సంతోష్, సిరిసిల్ల ప్రభుత్వ కళాశాల ఫార్మకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వాతి, స్థానిక వైద్యాధికారి ఉబ్బు నర్సింహ, తదితరులు ఉన్నారు.

ఎరువుల విక్రయాలను నమోదు చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



సుంకెనపల్లిలో తగులబెట్టిన వరికొయ్యలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

చిట్యాలరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లో ఎరువుల విక్రయాలను ఈ-పాస్ యంత్రంలో నమోదు చేయాలని జేడీఏ శ్రవణ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని గుండ్రాంపల్లి పీఏసీఎస్‌ను ఆయన తనిఖీ చేశారు. యూరియా నిల్వల రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని సీఈవో దంటిక రాజమల్లయ్యను ఆదేశించారు. సుంకెనపల్లిలో రైతు గంగాపురం ఔషయ్య వరిపొలాన్ని పరిశీలించారు. వరి కొయ్యలను తగలబెట్టడంతో భూసారం దెబ్బతింటుందన్నారు. వరి కొయ్యలను భూమిలో కలియదున్నాలన్నారు. తద్వారా భూసారం కూడా పెరుగుతుందని, సాగుకు అనువుగా ఉంటుందన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు, ఏఈవో, రైతులు ఉన్నారు.

ప్రాణవాయువులా పనిచేయాలి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- జిల్లా కేంద్రంలో ఏఆర్ పీసీల పాసింగ్ అవుట్ పరేడ్



శిక్షణ పూర్తిచేసుకొని జిల్లా కేంద్రంలో పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహిస్తున్న ఏఆర్ పీసీలు

6

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

హాలియా, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. గురువారం హాలియా మున్సిపాలిటీలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి క్యాంటీన్‌లు, సోలార్ పవర్ జనరేషన్ యూనిట్లు, ఉచిత బస్సు ప్రయాణం, మొబైల్ ఫిష్ అవుట్‌లెట్‌లు, మిల్క్‌పార్లర్ల ఏర్పాటు బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తోందన్నారు. మహిళలంతా సంఘాలుగా ఏర్పడి లబ్ధి పొందాలన్నారు. అదేవిధంగా మహిళా సంఘాల సభ్యులకు బీమా సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఈ ఏడాది జిల్లాలో బ్యాంక్ లింకేజీ కింద రూ.1,500 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో ఉన్న రైతు కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని నాయకులు కలెక్టర్‌ను కోరగా, వారి కోరిక మేరకు 100 రోజులు పని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, కుందూరు వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, మున్సిపాల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, సుధారాణి, పిల్లి ఆంజనేయులు, ప్రసాద్‌నాయక్, ఏపీఎం కళావతి, పాండునాయక్, వెంపటి శ్రీనివాస్, మజారుద్దీన్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

సుహాస్ జీవితం దివ్యాంగులకు ఆదర్శం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): ఉత్తరప్రదేశ్‌కు రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ అధికారి సుహాస్.ఎల్‌వై జీవితం దివ్యాంగులకు ఆదర్శమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను స్థానిక మేకల అభినవ స్టేడియంలో కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. టోక్యోలో జరిగిన పారా ఒలింపిక్స్‌లో సుహాస్ రెండుసార్లు పతకం సాధించి దేశానికి వన్నెతెచ్చారని కొనియాడారు. వైకల్యం అనేది అడ్డుకాదని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు జూనియర్, సీనియర్ విభాగంలో నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 25 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. జిల్లా స్థాయిలో క్యారం, చెస్, షాట్‌పుట్, వీల్ చైర్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.వి.కృష్ణవేణి, జిల్లా యువజన క్రీడల అధికారి విష్ణుమూర్తి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ అధ్యక్షురాలు విమల, సీడీపీవోలు నిర్మల, లావణ్య కుమారి, హరిత, సఖి కేంద్రం సిబ్బంది సునీత, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి మరిన్ని నిధులు

- ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని ఎంపీ రఘువీర్‌రెడ్డి అన్నారు. అదేవిధంగా మిర్యాలగూడకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహను కోరినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఐదు డయాలసిస్ మిషన్లతో కూడిన నూతన రక్తశుద్ధి కేంద్రాన్ని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, పేద మధ్యతరగతి వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో కార్పొరేట్‌కు ధీటుగా ఆధునిక పరికరాలతో ఆస్పత్రిని తీర్చిదిద్దాలని సంకల్పించినట్టు తెలిపారు. వైద్యశాఖ మంత్రిని కోరిన వెంటనే డయాలసిస్ యంత్రాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. దాతల సహకారంతో రోగులకు మరిన్ని వసతులు కల్పిస్తామన్నారు. సీఎంతో చర్చించి మెడికల్ కళాశాల మంజూరుకు కృషి చేస్తానన్నారు. పార్లమెంటు సమావేశాలు పూర్తి కాగానే స్థానిక ఎమ్మెల్యే, వైద్యాధికారులతో మాట్లాడి ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఎంపీ అన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన మిర్యాలగూడలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు స్కైలాబ్ నాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరి బాలు, పొదిల శ్రీనివాస్, గాయం ఉపేందర్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, తలకొప్పుల సైదులు, సలీం, అజహర్, కౌన్సిలర్లు శేఖర్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సమరథ్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికే సమగ్ర సర్వే

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



ఉరుమడ్లలో ఎన్యూమరేటర్లకు వివరాలు అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాలరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభ్యున్నతి, వారి సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సర్వే చేపడుతోందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా మండల పరిధిలోని ఉరుమడ్ల గ్రామంలో తన నివాసానికి గురువారం వచ్చిన ఎన్యూమరేటర్లకు మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి వివరాలు అందజేశారు. ఆయనతోపాటు కుటుంబ సభ్యుల వివరాలు నమోదుచేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వేకు ప్రజలందరూ సహకరించాలన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం అమలుచేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి



చిట్యాల సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

చిట్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ జిల్లా చిట్యాలలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. డిసెంబరు 2 నుంచి 4వరకు మిర్యాలగూడలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అరూరి శ్రీను, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, కత్తుల లింగస్వామి, బొబ్బల సుధాకర్ రెడ్డి, ఐతరాజు నర్సింహ, కల్లూరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని సీపీ ఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, కల్లూరి యాదగిరి, చెర్కు పెద్దులు, కల్లూరి కంఠమహేశ్వర్, నన్నే సాహెబ్, కుమ్మరి శంకర్, దండు రవి, ఆమనగంటి ఐలయ్య, కట్ట రామచంద్రం, సోమనబోయిన సైదులు, ముప్పిడి సత్యం, బొల్లెద్దు సైదులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం నిలిపిన 108 సిబ్బంది

భువనగిరి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీపీఆర్ చేసి 108 వాహన సిబ్బంది ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడారు. సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో గురువారం ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటకు చెందిన సిద్ధులు కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబసభ్యులు అప్రమత్తమై వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు తుర్కపల్లికి చెందిన వాహనం గ్రామానికి చేరుకోగానే ఎలాంటి హృదయ స్పందన లేకుండా స్పృహ తప్పి పడిన సిద్ధులును గమనించిన 108ఈఎంటీ అంబేద్కర్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. విలువైన ప్రాణాలు కాపాడి ఆసుపత్రికి తరలించిన 108పైలెట్ రాకేష్, ఈఎంటీ అంబేద్కర్, సిబ్బందిని జిల్లాఆసుపత్రి డీఎంవో విష్ణు, కుటుంబసభ్యుల సమయస్ఫూర్తికి అభినందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఆందోళ్ మైసమ్మ హుండీ కానుకల లెక్కింపు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఉన్న దండుమల్కాపురం ఆందోళ్ మైసమ్మ దేవాలయ హుండీ కానుకలను గురువారం లెక్కించారు. 50రోజులకు రూ.14,96,475 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు ఏడుకొండలు, ఈవో మోహన్‌బాబు, సిబ్బంది సత్తిరెడ్డి, అర్చకులు శివప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

ప్రాణవాయువులా పనిచేయాలి



పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, పక్కన సూర్యాపేట, నల్లగొండ జిల్లాల ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, శరత్‌చంద్ర పవార్, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- డీటీసీలో ముగిసిన ఏఆర్ పీసీల పాసింగ్ అవుట్ పరేడ్
- ఆకట్టుకున్న ఏఆర్ పీసీల కవాతు

నల్లగొండ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించడం అంటే ప్రజలకు సేవ చేయడమేనని, ప్రజలకు సమర్థమైన సేవలందిస్తూ ప్రాణవాయువులా పనిచేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు.ఈ శాఖలో ఉద్యోగం అదృష్టంగా భావించి అంకిత భావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ కేంద్రంలో తొమ్మిది నెలలుగా శిక్షణ పొందిన సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, నారాయణపేట, నిర్మల్ జిల్లాలకు చెందిన 265 మంది ఏఆర్ ట్రైనింగ్ కానిస్టేబుళ్లకు నిర్వహించిన బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఆయనకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఎస్పీలు శరత్ చంద్ర పవార్, సన్ ప్రీత్‌సింగ్‌లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన పరేడ్‌లో ఆయన మాట్లాడుతూ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్‌శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని తెలిపారు. పోలీస్ శాఖ ఎన్నో సవాళ్లతో కూడుకున్న ఉద్యోగమని, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నప్పుడే ఎలా ంటి సవాళ్లనైనా ఎదుర్కోగలమన్నారు. శిక్షణ అనంతరం కూడా ప్రతి రోజూ వ్యాయామం చేసి ధృడ ంగా ఉండాల న్నారు. అధికారుల సలహాలు, సూచ నలు పాటిస్తూ తమకు కేటాయిం చిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఎంతో కష్టపడి చదివించిన తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, ఇప్పుడు పొందిన శిక్షణ సర్వీస్ పూర్తయ్యేంత వరకూ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏఆర్ కానిస్టేబుళ్లు ప్రదర్శించిన పరేడ్ ఆకట్టుకుంది.కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ రమేష్, అడ్మిన్ ఏఎస్పీ రాములునాయక్, డీటీసీ డీఎస్పీ విఠల్‌రెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు డానియల్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి, దూది రాజు, ఆర్ఐలు హరిబాబు, శ్రీను, సంతోష్, ఎస్ఐలు బాబు, ప్రవీణ్, శ్రీనివాస్, భరత్, ఆర్ఎస్ఐలు అఖిల్ చంద్ర, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు జయరాజు, సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మా నాన్నల కల నెరవేర్చా



మాది నిరుపేద కుటుంబం. మా సొంత ఊరు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామం. అమ్మా కనకమ్మ నాన్న సాయిలు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ నన్ను డిప్లొమా ఇంజనీరింగ్ వరకూ చదివించారు. మానాన్న కోరిక నేను ఆర్మీలో చేయాలి, కానీ నేను మా అమ్మా నాన్నకు ఒక్క కొడుకునే కావడంతో అటుగా పంపలేదు. యూనిఫాం సర్వీస్ చేయాలనే వారి కోరిక మేరకు కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగం సాధించా. వారి కళ్ల ముందే ఉండి వారిని మంచిగా చూసుకోవాలనే ఆలోచనతో పోలీస్ ఉద్యోగం సాధించా. నల్లగొండ డీటీసీలో ప్రిన్సిపాల్ సహకారంతో శిక్షణ పూర్తి చేశా. ఇక్కడ శిక్షణ ఎంతో బాగుంది.

ఒగ్గు కృష్ణ

ఆర్మీలో పనిచేశా.. పోలీస్ కానిస్టేబుల్‌గా సేవలందిస్తా



మాది వికారాబాద్ జిల్లా తాండూరు గ్రామం. మాది పేద కుటుంబం అయినా మా అమ్మ నాన్న నన్ను డిగ్రీ వరకూ చదివించారు. 17 ఏళ్లుగా ఆర్మీలో సేవలందించి రిటైర్ అయ్యా. మా నాన్న శివన్న చనిపోయినా మా అమ్మ ఎంతో ప్రోత్సహించేది. 13 ఏళ్ల క్రితం అనురాధతో నాకు వివాహం కాగా బాబు, పాప ఉన్నారు. ఆర్మీలో సేవలందించి రిటైర్ అయ్యాక ఎస్ఐ కావాలనుకున్నా. కానీ ఎస్ఐ ఉద్యోగం ఒక్క మార్కుతో రాలేదు. కాగా ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. ఆర్మీలో మాదిరిగానే సేవలను కానిస్టేబుల్‌గా ప్రజలకు సేవలందిస్తా.

నాటికర్ సుభాష్



సోదరుడి టోపీతో చెల్లెలు సెల్ఫీ

ఆనందంగా గడుపుతూ..

శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ పీసీలు తమ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకుని కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకున్నారు. సోదరుడి క్యాప్‌లను ధరించి చెల్లెళ్లు సంతోషంలో మునిగిపోయారు. శిక్షణ కోసం తొమ్మిది నెలలుగా ఇంటికి దూరంగా ఉండటంతో ఇంటి నుంచి భోజనాన్ని తీసుకువచ్చి కుటుంబ సమేతంగా కలిసి భోజనం చేసి జ్ఞాపకాలను పంచుకున్నారు. 265 మంది ఏఆర్ పీసీల శిక్షణ ముగింపు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, బంధువులతో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో సందడి నెలకొంది.



కుమార్తెకు గోరుముద్దలు తినిపిస్తున్న తండ్రి



పోలీస్ విన్యాసంతో ట్రైనర్‌కు అభివాదం చేస్తున్న శిక్షణ పూర్తి చేసిన కానిస్టేబుళ్లు



కుమారుడికి ఆహారం తినిపిస్తున్న తల్లిదండ్రులు

సంబురంగా దివ్యాంగుల దినోత్సవం

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని అవుట్‌డోర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఆ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. క్రీడాకారుడితో కలిసి చెస్ ఆడారు. ర్యాలీని ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ పోటీల మధ్య సంబురంగా దినోత్సవాన్ని దివ్యాంగులు జరుపుకున్నారు.



దివ్యాంగుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు





దివ్యాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి, క్రీడాకారుడితో కలిసి చెస్ ఆడుతున్న కలెక్టర్

జిల్లా వ్యాప్తంగా చెకుముకి పోటీలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లావ్యాప్తంగా చెకుముకి టాలెంట్ పోస్టులను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. హాలియాలో నల్లగొండ జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో అనుముల మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పేపరును సీఐ జనార్ధన్‌గౌడ్, ఎంఈవో గుండా కృష్ణమూర్తిలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా బాధ్యులు కత్తి కోటిరెడ్డి, లింగాల సైదులు పాల్గొన్నారు.

● దామరచర్లలో ఎంఈవో బాలాజీనాయక్, ఎస్ఐ హరికృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కేతావత్ సైదానాయక్ పాల్గొన్నారు.

● చిట్యాలలో ఎంఈవో పోనుగోతు సైదానాయక్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ మండల కన్వీనర్ దాసరి శ్రీరాములు, కుకుడాల గోవర్ధన్ పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మేక నాగయ్య, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్, రిసైవ్ ఆసుపత్రి డాక్టర్ చేతరాజు రవికిరణ్ పాల్గొన్నారు.

●కట్టంగూరులో ఎంఈవో అంజయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు ఆంజనేయులు ఉన్నారు.

కార్తీకమాస పూజల సందడి



బాడవతండాలో మహాపడిపూజ కోసం ఏర్పాటు చేసిన భారీవేదిక

మఠంపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం బాడవతండాలో స్థానిక స్వాముల ఆధ్వర్యంలో మహాపడిపూజ మహోత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు రవి, సైదా, తిరపతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకకు మండలవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప, హనుమాన్, శివస్వాములు పాల్గొన్నారు. పడిపూజ, మహాయజ్ఞం, మెట్లపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో కన్నులపండువగా నిర్వహించారు.

● చింతపల్లి: అయ్యప్పదీక్షతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వింజమూర్‌లోని హరిహర క్షేత్రంలో అయ్యప్పస్వాములు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్,ప్రధానకార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్, వెన్నం శేఖర్, కుందేళ్ల శ్రీశైలం పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అయ్యప్ప ఆలయాన్ని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి గురువారం సందర్శించారు. అయ్యప్పస్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 27న సాగర్ నియోజకవర్గ కేంద్రమైన హాలియాలో నిర్వహించనున్న మహాపడిపూజలో పాల్గొనాలని భక్తులను కోరారు. ఆయన వెంట నవీన్, వరుణ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడరూరల్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరులోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రుద్రాభిషేకం, అయ్యప్ప మహా పడిపూజ, అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కన్నెగుండ్ల కరుణాకర్, ఉమామహేశ్వరి తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.

● చౌటుప్పల్ టౌన్: అయ్యప్పస్వామిని నిష్ఠతో పూజించే భక్తులకు అంతా మేలే జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ పట్టణ ఇన్‌చార్జి మొగుదాల రమేష్‌గౌడ్ అన్నారు. స్థానిక బాలాజీ దేవాలయంలో అయ్యప్ప భక్తులకు రమేష్ గౌడ్- సాహితీ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బత్తుల విప్లవ్‌కుమార్, గురుస్వామి టీఎస్ గౌడ్, చెవగోని మహేష్, నప్పిడి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి కోదండరాముడికి సామూహికంగా 'లక్ష తులసీదళార్చన'ను నిర్వహించారు. కోదండరాము ని జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు.



నేరడలో లక్ష తులసీదళాలతో అర్చన

అంగడిపేట ఎక్స్‌రోడ్డు @ అయ్యప్పపేట

ఆ గ్రామంలో ఏ దేవాలయమూ లేదు. అయినా ఆధ్యాత్మిక వాతావరణం పుష్కలం. 25 ఏళ్ల కిందట ముగ్గురితో మొదలైన అయ్యప్పస్వామి మాలధారణ దీక్ష నేడు 60 మందికి చేరాయి. గ్రామంలోని ఖాళీ ప్రాంతాన్ని తమ సన్నిధానంగా మార్చుకుని నిష్ఠతో ప్రతి రోజూ పూజలు, భజనలు, భిక్ష(భోజనాల)ను చేపడుతుంటారు. అదేవిధంగా ఏటా శబరిమలై యాత్రకు అందరూ కలిసి వెళ్తుండటం మరో విశేషం. గత 15 ఏళ్లుగా ఏటా ఘనంగా మహాపడి పూజ నిర్వహిస్తుండగా, శబరిమలైలో పూజలు చేసే తాంత్రిక పూజారి బ్రహ్మశ్రీ సత్యనారాయణ గురుస్వామి ఇక్కడ మహాపడి నిర్వహిస్తుండడం ప్రత్యేకత. ఆ అత్యద్భుత సన్నిధానం కోసం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై ఉన్న అంగడిపేటకు ఎక్స్‌రోడ్డు వద్దకు వెళ్లాల్సిందే.

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)

- ఆలయం లేని చోట ఆధ్యాత్మిక నిలయం
- పాతికేళ్లుగా అయ్యప్ప సన్నిధానం ఏర్పాటు
- సన్నిధానంలో నేడు మహాపడిపూజ

పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారికి కిలోమీటర్ దూరంలోని అంగడిపేట గ్రామంలో పలు ఆలయాలు ఉన్నప్పటికీ అంగడిపేట ఎక్స్‌రోడ్డు అన్నిరంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందింది. అయినప్పటికీ ఇక్కడ ఒక్క ఆలయమూ లేదు. అయినా ఇక్కడ ప్రతి ఏటా కార్తీకమాసంలో ప్రారంభమయ్యే అయ్యప్పదీక్షలు ఊరంతటికీ ఆధ్యాత్మిక వాతావరణాన్ని పంచుతాయి. గడిచిన 10 ఏళ్లుగా రైతు భవనమే అయ్యప్పలకు సన్నిధానమై ప్రత్యేక ఆలయంగా మారింది. గత ప్రభుత్వం రైతు భవనాన్ని రైతు వేదికగా మార్చడంతో ఈసారి మూతపడిన పాఠశాలను సన్నిధానంగా చేసుకుని ప్రతిఒక్కరూ ఇక్కడే పూజాధికాలను చేస్తున్నారు. ప్రతిరోజూ ఇక్కడ భజనలు చేపడుతుంటారు. మధ్యాహ్నం భిక్ష కూడా ఇక్కడే స్వాములంతా సన్నిధానంలోనే ఆరగిస్తారు. ఎవరైనా స్వాములు ప్రత్యేకంగా భిక్ష పూజ ఏర్పాటుచేసిన రోజు అందరూ కలిసికట్టుగా హాజరవుతారు. కేరళ అయప్ప దేవాలయంలో నిర్వహించే విధంగా సాక్షాత్తు శబరిమలై పూజలు చేసే తాంత్రిక పూజారే బ్రహ్మశ్రీ సత్యనారాయణ గురుస్వామిచే ఈ నెల 22న అత్యద్భుతంగా మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు స్వాములు తెలిపారు.



సన్నిధానంలో పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

సన్నిధానమే లోకం



అయ్యప్పమాల ధరించిన రోజు నుంచి సన్నిధానమే లోకంగా ఉంటా. ఈసారి 60మంది సన్నిధానంలో మాల వేసుకున్నారు. 20మంది కన్నెస్వాములు ఉండడం ఆనందంగా ఉంది. అందరం కలిసికట్టుగా నిష్ఠతో పూజలు నిర్వహిస్తాం. దీక్షలో ఉన్నన్ని రోజులు శరణుఘోషతో పాటు సన్నిధానమే లోకంగా ఉంటాం. ఈ నెల 22న మహాపడిపూజ అద్భుతంగా నిర్వహిస్తాం.

బైరు యాదగిరి, 19వ పడి

ఎక్కడికెళ్లినా సన్నిధానం చేరాల్సిందే




ప్రస్తుతం సీజన్ కావడంతో ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రతిరోజూ వేర్వేరు ప్రాంతాల్లో తిరుగుతుంటా. అయినా ఖచ్చితంగా సన్నిధానంలో పూజా కార్యక్రమాలకు హాజరవుతుంటా. ఎక్కడ ఉన్నా సన్నిధానం వెళ్లకుంటే ఏదో వెలితిగా అనిపిస్తుంది. పదేళ్లుగా అయ్యప్పదీక్ష చేపడుతున్న. అందుకు ఖచ్చితంగా మా సన్నిధానం వాతావరణం కూడా కారణమే.

అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, 10వ పడి

ముగ్గురితో మొదలై నేడు 60 మందికి

పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు అయ్యప్పపేటగా విరాజిల్లుతోంది. 1999లో ఇదే గ్రామానికి చెందిన కుక్కల గోవర్ధన్ రెడ్డి, వేమ చెన్నారెడ్డి, పున్న యాదగిరి ముగ్గురు సాగర్‌కు చెందిన మీనన్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇక్కడ తొలిసారిగా అయ్యప్పదీక్ష చేపట్టారు. నాటి నుంచి ఏటా అయ్యప్ప మాలధారుల సంఖ్య క్రమంగా పెరుగుతుండగా ఎంత మంది పెరిగినా అందరూ ఒకే సన్నిధానంగా నిత్యపూజలు నిర్వహిస్తుండడం విశేషం. ఈ ఏడాది ఉమ్మడి మండలం(గుడిపల్లి, పీఏపల్లి) గ్రామాల నుంచి మొత్తం 60మంది ఈ సన్నిధానం వేదికగా అయ్యప్ప మండలదీక్ష చేపట్టారు. వీరిలో ఇప్పటికే 18వ పడి చేరుకున్న ఇద్దరు గురుస్వాములతో పాటు 10 మంది గురుస్వాములు ఉన్నారు. అదేవిధంగా ఈ సారి అత్యధికంగా 20 మంది కన్నె స్వాములు కూడా ఉండడం విశేషం. చిన్ని గురుస్వామి, మల్లయ్య గురుస్వామి సమక్షంలో మాలలు ధరించగా బైరు యాదగిరి గురుస్వాముల ఆధ్వర్యంలో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు.

నిష్ఠగా అయ్యప్ప మండల దీక్ష



నా కుమారుడు ఇప్పటికే పలుమార్లు స్వామిమాల ధరించాడు. నేను తొలిసారిగా అయ్యప్పదీక్ష తీసుకున్నా.సన్నిధానంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమం, భజన గురుస్వాములు అత్యద్భుతంగా నిర్వహిస్తున్నారు. గురుస్వాముల సూచనల మేరకు కన్నెస్వామిగా నిత్యం పూజలు చేస్తున్నా.

- గున్‌రెడ్డి జనార్ధన్‌రెడ్డి, కన్నెస్వామి.

'గుట్ట' పాలకమండలి దిశగా అడుగులు

● సీఎం ఆదేశాలతో అధ్యయనం ● 12 మంది సభ్యులతో పాలకమండలి నియామకానికి యోచన



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సుమారు 15 ఏళ్లుగా పాలకమండలి లేదు. ఆలయానికి పాలకమండలి నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 8వ తేదీన యాదగిరిగుట్టలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న సమీక్షా సమావేశంలో గుట్ట పాలకమండలి ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసిన విషయం విదితమే. దీంతో గుట్ట పాలకమండలి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. తిరుపతి తిరుమల దేవస్థానం(టీటీడీ) తరహాలో యాదగిరిగుట్ట పాలకమండలిని నియమించేందుకు అధ్యయనం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి అర్బన్)

యాదగిరిగుట్ట ఆలయ పాలకమండలిని 12మంది సభ్యులతో నియమించాలని ప్రభుత్వం యోచిస్తుండగా, ఇందులో దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ ఈవోను కూడా సభ్యులుగా ఎంపిక చేస్తారు. చైర్మన్, సభ్యుల నియామకానికి విధివిధాల రూపకల్పనకు ప్రభుత్వం అధ్యయనం మొదలుపెట్టింది. టీటీడీ పాలక మండలి నియామకానికి అమలు చేస్తున్న విధానాలు, యాదగిరిగుట్ట పాలకమండలి నియమించేందుకు ఎలాంటి నిబంధనలు ప్రవేశపెట్టాలనే అంశాలపై అధికారులు నివేదిక రూపొందించి ప్రభుత్వానికి ఇవ్వనున్నారు. దీనిపై త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. చైర్మన్‌తో కలిపి పాలక మండలి నేరుగా నియమించాలనేది ప్రభుత్వ నిర్ణయంగా తెలుస్తోంది. దీనికి ఫ్యామిలీ ఫౌండర్ ట్రస్ట్(ఎఫ్ఎఫ్‌టీ) చైర్మన్ వ్యవస్థ అడ్డుగా మారింది. రాష్ట్రంలోని దేవాలయాల్లో ఎఫ్ఎఫ్‌టీ విధానాన్ని మార్చాల్సి వస్తే పరిస్థితి ఏవిధంగా ఉంటుంది? చైర్మన్‌తో కలిపి నియమిస్తే ఎలా ఉంటుందనే అంశాలపై చర్చిస్తున్నట్లు సమాచారం. ఎఫ్ఎఫ్‌టీని తొలగిస్తే వారు కోర్టును ఆశ్రయించే అవకాశముందని ప్రభుత్వం యోచిస్తోంది.

● యాదగిరిగుట్ట ఆలయంతో పాటు జిల్లాలోని పలు ఆలయాలకు పాలక మండలి నియమించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం 14 మంది పాలకమండలి సభ్యులను నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినా అది కార్యరూపం దాల్చలేదు.

2009 వరకే పాలక మండలి

2009 సంవత్సరం వరకే పాలక మండలి నియామకం జరిగింది. అప్పుడు మూడేళ్ల కాలపరిమితిలో అనువంశిక ధర్మకర్తతో కలిపి 9మంది సభ్యులతో మండలి నియామకం జరిగేది. 2016 సంవత్సరం నుంచి వైటీడీఏ ఏర్పాటు చేసిన తర్వాత ఆలయం పునర్నిర్మించేందుకు పాలకమండలితో పని లేకుండా వైటీడీఏ ఆవిర్భవించింది. ఇందుకు గాను గత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినా పోటీ పెరగడంతో దానిని పక్కన పెట్టారు. సుమారు 15ఏళ్లుగా పాలక మండలి లేకుండానే ఆలయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం హైదరాబాద్‌తో పాటు అంతకంటే సమీపంలో ఓఆర్ఆర్ ఉండడంతో దేశ, విదేశాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం సెప్టెంబరులో పాలకమండలిని నియమించాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో తాత్కాలికంగా వాయిదా పడినట్లు సమాచారం. సీఎం ఆదేశించడంతో యాదగిరిగుట్ట ఆలయ పాలకమండలి నియామకానికి వేగం పుంజుకుంది.

బదిలీపై వెళ్లిన అధికారులు ఒక్కొక్కరుగా..

యాదగిరిగుట్ట ఆలయం నుంచి బదిలీపై వెళ్లిన అధికారులు ఒక్కొక్కరుగా తిరిగి ఇక్కడే విధుల్లో చేరుతున్నారు. సుమారు 12ఏళ్ల తర్వాత ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన అధికారుల కుటుంబ పరిస్థితుల కారణంగా ఒకరు, 2025 ఆగస్టులో ఉద్యోగ విరమణ పేరుతో ఒకరు, డిప్యూటేషన్‌పై మరొకరు ఇలా ఒక్కొక్కరుగా ఇక్కడ చేరడం స్థానికంగా చర్చాంశనీయమైంది. 2024 ఆగస్టు 5న రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జనరల్ బదిలీల్లో భాగంగా ఇక్కడి నుంచి ఏఈవో, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్, రికార్డు అసిస్టెంట్లు మొత్తం 26మందిని వేములవాడ, బాసర, భద్రాచలం, కొండగట్టు, కొమురవెల్లి ఆలయాలకు బదిలీ చేశారు. వేములవాడలో విధులు నిర్వహిస్తున్న అధికారులే ఇప్పుడు ఒక్కొక్కరుగా యాదగిరిగుట్ట ఆలయానికి వస్తున్నారు.

ముగ్గురు అధికారులు వెనక్కి

బదిలీలు జరిగిన 11రోజుల డిప్యూటేషన్‌పై తొలత సూపరింటెండెంట్ రాజన్‌బాబు యాదగిరిగుట్టకు తిరిగి వచ్చేసి విధుల్లో చేరారు. వేములవాడ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ గోలి శ్రీనివాస్ అక్కడి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు మేరకు పీఏగా వెళ్లారు. అక్కడి నుంచి డిప్యూటేషన్‌పై రాజన్‌బాబుకు అవకాశం దక్కింది. సెప్టెంబరు 23న సూపరింటెండెంట్ శ్రీలత, ఈ నెల 14న ఏఈవో గజ్వేల్లి రమేష్‌బాబు వేములవాడ నుంచి అధికారుల ఆదేశాల మేరకు యాదగిరిగుట్టలో విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ పరిస్థితుల కారణంగా శ్రీలత, ఉద్యోగ విరమణ పొందిన వేముల రామ్మోహన్ స్థానంలో 2025ఆగస్టులో ఉద్యోగ విరమణ పొందనుండటంతో తిరిగి అదేస్థానంలో ఏఈవోగా రమేష్‌బాబు ఇక్కడ విధుల్లో చేరారు. ఇది వరకు 14 మంది సూపరింటెండెంట్లల్లో ఎనిమిది మంది బదిలీపై వెళ్లగా వారి స్థానంలో ఆరుగురు ఇక్కడ చేరారు. ఇంకా ఇద్దరు పర్యవేక్షకులకు తిరిగి శ్రీలత చేరికతో ఒక సూపరింటెండెంట్ ఇక్కడ అవసరముంది. ఐదుగురు ఏఈవోలకు గాను వేములవాడ నుంచి బదిలీపై వచ్చిన హరిక్రిష్ణ దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. కాగా, ఏదో ఒక రకంగా ఒకరెనుకా..ఒకరు అందరు ఇక్కడికే చేరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేరికలు



దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేరికలు ఇప్పటి వరకు జరిగాయి. ఏఈవో హరిక్రిష్ణ దీర్ఘకాలిక సెలవులపై వెళ్లగా ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక్కడి నుంచి ఎనిమిది మంది సూపరింటెండెంట్లకు ఆరుగురు సూపరింటెండెంట్లు మాత్రమే ఇక్కడ విధుల్లో చేరారు. అదనంగా వేములవాడ నుంచి సూపరింటెండెంట్ శ్రీలత చేరికతో ఏడుకు చేరింది. ఇంకో సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగానే ఉంది.

భాస్కర్‌రావు, యాదగిరిగుట్ట దేవస్థాన ఈవో .

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	230
సూర్యాపేట	రూ.120	180	200
నల్లగొండ	రూ.132	194	214

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	584.60
టీఎంసీలు	295.4155
ఎడమకాల్వకు నీటి విడుదల	5367
కుడికాల్వకు	10,438
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	31,115
అవుట్‌ఫ్లో	31,315 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.54 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	330 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2వేల క్యూసెక్కులు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.42 అడుగులు
టీఎంసీలు	4.31
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	152.31 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	399.53 క్యూసెక్కులు

పరిమితికి మించి ప్రయాణికులు.. ఆటోలు సీజ్

చింతపల్లి, కొండమల్లేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్న డ్రైవర్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలకేంద్రంలో ఎస్ఐ యాదయ్య గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. కొండమల్లేపల్లి మండలం ఘాజీనగర్‌కు చెందిన బత్తుల యాదయ్య తన ఆటోలో 17మంది ప్రయాణికులతో వెళ్తున్నాడు. పోలీసులు ఆటోను తనిఖీ చేయగా అందులో 17మంది కూలీలు ఉన్నారు. ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల నుంచి చింతపల్లి వైపు ఆటోలో పరిమితికి మించి 20మంది పత్తి కూలీలను ఆటోలో ఎక్కించుకొని నిర్లక్ష్యంగా అజాగ్రత్తతో నడుపుతున్న ఆటోను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

భువనగిరి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో పాత గోశాల వద్ద ఒకరిపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 19న (మంగళవారం) పట్టణ బీసీ కాలనీకి చెందిన షేక్ ఇమ్రాన్(22) పాత గోశాల శ్రీలక్ష్మీ నరసింహ డార్మెంటరీ వద్ద పనిచేస్తున్న కసావు కుమార్‌ను డబ్బుల కోసం బెదిరించాడు. డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో ఇమ్రాన్ సదరు వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని సాగర్‌రోడ్డుపై ట్రాఫిక్ సమస్యను నియంత్రిస్తున్న క్రమంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ నడిరోడ్డుపై కారు నిలిపాడు. వాహనా రాకపోకలకు అంతరాయం ఏర్పడే విధంగా నిలిపిన కారును తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రయత్నించారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆర్. సుధీర్ పట్ల ఇర్ఫాన్ అసభ్యకరంగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినట్లు డీఎస్పీ తెలిపారు. కారుతోపాటు సదరు వ్యక్తిని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి పరీక్షించగా మద్యం మత్తులో ఉన్నట్లు తేలిందని, ఇర్ఫాన్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసుతోపాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన నేరం కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

తప్పతాగి డయల్ 100కు ఫోన్ చేసి..

కొండమల్లేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లికి చెందిన మారోజు కుమార్ తప్పతాగి పోలీసు విధులకు ఆటంకం కలిగించేలా 15 సార్లు డయల్ 100కు ఫోన్ చేశాడు. అక్కడికి వెళ్లిన పోలీసు కానిస్టేబుల్ మాజిద్, శేఖర్‌ను బూతులు తిడుతూ వారి విధులకు ఆటంకం కలిగించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు సదరు వ్యక్తిని తరలించినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మునగాల, నవంబరు 21: (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మండలంలోని నరసింహులగూడెం గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన క్వింటాల్ రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన శెట్టి వెంకటేశ్వర్లు క్వింటా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి వ్యాపారం చేస్తున్నాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పౌరసరఫరాల అధికారి(డీటీసీ) రమణారెడ్డి, పోలీసులు కలిసి దాడి చేసి పట్టుకున్నారు. వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని విచారించగా రేషన్ బియ్యం మోతె మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా పాఠశాల ఎస్‌వో దేవరం ధనలక్ష్మి వద్ద కొనుగోలు చేశానని తెలిపాడు. విక్రయించిన, కొనుగోలు చేసిన ఇద్దరిపై పై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రమీణ్‌కుమార్ తెలిపారు.

అర్ధరాత్రి తిరుగుతున్న యువతకు కౌన్సిలింగ్

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ద్విచక్రవాహనాలతో రోడ్లపై తిరుగుతున్న యువకులకు పోలీసులు కౌన్సింగ్ నిర్వహించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన రహదారులపై డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా బుధవారం రాత్రి ఆపరేషన్ చబుత్ర కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని పలు ప్రధాన రహదారులపై అర్ధరాత్రి దాటాక 26 ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న 32మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. యువకుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి ప్రత్యేక కౌన్సింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప రాత్రివేళలో బయటకు రాకూడదని, ప్రజా స్వేచ్ఛకు ఆటంకం కలిగిచేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆపరేషన్ చబుత్ర కార్యక్రమంలో సీఐలు నాగర్జున, కరణాకర్, ఎస్ఐలు సుధీర్‌కుమార్, రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గేయ కావ్యం అభినందనీయం'

నకిరేకల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన స్థితిగతులపై సినీ గేయ రచయిత, వరంగల్ శ్రీనివాస్ 'నూరేళ్ల నా ఊరు పేట' కవితాత్మకంగా సుదీర్ఘ గేయకావ్యం రాయడం అభినందనీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మనుషుల్లో వచ్చిన మార్పు మానసిక పరిస్థితుల గురించి విపులంగా విశదీకరించి కవితాత్మకంగా సుదీర్ఘ గేయకావ్యం రాయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఏపూరి సోమన్న, కోదారి శ్రీనివాస్, అంబటి వెంకన్న, మద్యల సందీప్, గూడూరు మహేష్, రాయి వసంత పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైడూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శనశతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పిన అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 40,85,825ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా 552 జంటలు సత్యదేవుని వ్రతాలు పాల్గొన్నాయి. మహిళా భక్తులు కార్తీక దీపారాధన చేశారు. రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు, డీసీపీ రాజేష్‌చంద్ర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదాలను అందజేశారు.

ఆలయానికి చేరిన బంగారు రేకులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ గాలి గోపురం స్వర్ణతాపడానికి బంగారు తొడుగులు గురువారం ఆలయానికి చేరుకున్నాయి. దివ్య విమాన రాజగోపురానికి బంగారు తాడపం(తొడుగుల పనులు) బుధవారం మొదలుపెట్టారు. ఇందులో భాగంగా 2032 చదరపు అడుగుల స్వర్ణ రేకులు చేరుకోగా గురువారం మరో సుమారు రెండు వేల చదరపు అడుగుల బంగారు రేకులు చెన్నై నుంచి కంటైనర్‌లో యాదగిరిగుట్టకు చేరుకున్నాయి. స్వర్ణ తొడుగుల కోసం 10,500 చదరపు అడుగులకు ఇప్పటికే సుమారు 4032 చదరపు అడుగుల బంగారు తొడుగులు ఇక్కడకు చేరాయి.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

● విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం ● పెద్ద మంటలతో పూర్తిగా ఒరిగిన స్తంభం ● సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఘటన

హుజూర్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని ఓ వాహనం ఢీకొట్టిన ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గురువారం సాయంత్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురంలో మినీ ట్యాంక్‌బండ్ వద్ద రూ.2కోట్లతో చెరువుకట్టను నిర్మిస్తున్నారు. నిర్మాణానికి సంబంధించి కంకర, ఇసుక, డస్ట్ నీళ్ల ట్యాంక్ పక్కన నిల్వచేయగా, వారంరోజులుగా పనులు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం కంకర, ఇసుక, డస్ట్‌ను తీసుకెళుతున్న వాహనం (అజాక్స్ మిషన్) డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో స్తంభం పూర్తిగా ఒరిగిపోయి విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి మంటలు లేచి విద్యుత్ సరఫరా నిలిచింది. ఈ ఘటనతో ఆ సమయంలో అటువైపుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ప్రజలు ఉంటే పెను ప్రమాదం జరిగేదని పేర్కొన్నారు. 8, 9వ వార్డుల్లో ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 9గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



హుజూర్‌నగర్‌లో అజాక్స్ మిషన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఒరిగిన స్తంభం

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన బైక్.. యువకుడు మృతి

మర్రిగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పిపడడంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన గ్యార అంజయ్య కుమారుడు గ్యార నర్సింహ(27) అతనితో పాటు ఏర్పుల శివ మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లిలో తన బంధువుల ఇంటికి వెళ్తున్నామని ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. మాల్ నుంచి మర్రిగూడకు వస్తుండగా గురువారం తెల్లవారుజామున బైక్ అతివేగంగా వస్తూ తిరుగండ్లపల్లి శివారులోని ఇప్పబండా గుట్ట మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో బైక్ వెనకాల కూర్చున గ్యార నర్సింహ చెట్లపొదల్లో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న ఏర్పుల శివకు తీవ్రగాయాలయ్యాయి. నర్సింహ స్వగ్రామం సుద్దపల్లిలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. నర్సింహ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



నర్సింహ మృతదేహం

రచ్చకెక్కిన డీఈవో భిక్షపతి కుటుంబ వివాదం

● ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన భార్య ● మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపణ ● విడాకుల విషయంలో కోర్టులో నడుస్తున్న కేసు

నల్లగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి కుటుంబ వివాదం రచ్చకెక్కింది. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో డీఈవో భిక్షపతి నివాసం ఉన్న ఇంటికి బంధువులతో కలిసి చేరుకున్న ఆయన భార్య మాధవి ఆందోళన చేపట్టింది. ఈ సమయంలో డీఈవో, ఆయన భార్య, బంధువుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన మాధవితో భిక్షపతికి 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే వివాహం జరిగిన నెల రోజులకే ఆయన తన భార్యకు దూరంగా ఉంటూ వచ్చినట్లు సమాచారం. భార్యను ఇంటి నుంచి పంపించడమే కాకుండా మరో మహిళతో సహజీవనం చేస్తున్నట్లు భార్యతో పాటు బంధువులు ఆరోపించారు. ఇదిలా ఉంటే వీరిద్దరి విడాకుల విషయం ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుంది. ఈ నెలలోనే తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కోర్టులో కేసు ఉన్నప్పుడు మరో మహిళతో ఎలా సహజీవనం చేస్తున్నాడని ఆయన భార్య ప్రశ్నించింది. అంతేకాక పెళ్లి అయిన నెల రోజులకే తనను ఇంటి నుంచి భిక్షపతి వెళ్లకొట్టాడని, ఆ తర్వాత మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపించింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య కొద్ది రోజులుగా వివాదం చోటుచేసుకోవడంతో పాటు అనేకసార్లు డీఈవోను ఆమె నిలదీసినట్లు తెలిసింది. తాజాగా గురువారం డీఈవో భిక్షపతి ఇంటికి బంధువులతో కలిసివచ్చి ఘర్షణ పడింది. తనతో వివాహమైన తర్వాత మరో మహిళతో ఎలా ఉంటావంటూ ఆయన్ను ప్రశ్నించడంతో పాటు వాగ్వివాదానికి దిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి వివాదం చోటుచేసుకోకుండా ఇరువురిని సముదాయించారు. ఆయన పెడుతున్న వరకట్నం వేధింపులు భరించలేక తాను దూరంగా ఉంటున్నానని, తనపై లేనిపోని ఆరోపణలు చేసి తనను ఇంటి నుంచి పంపించి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని భార్య మాధవి ఆరోపించింది. తన భర్త అన్యాయం చేశాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని భార్య మాధవి నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వివాదంపై డీఈవో భిక్షపతిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇది కుటుంబంలో చిన్న సమస్య అని, కోర్టులో కేసు ఉందని, ఈ నెలలో తీర్పు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.



డీఈవో భిక్షపతిని నిలదీస్తున్న భార్య మాధవి



క్యాంపస్ సమాచారం

ఎంజీయూ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

నల్లగొండ, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, పీజీ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫలితాలను వీసీ అల్తాఫ్ హుస్సేన్ గురువారం తన కార్యాలయంలో విడుదల చేశారు. పీజీ రెండో సెమిస్టర్‌లో 1143మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 62.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. పీజీ సెమిస్టర్ బ్యాక్‌లాగ్‌లో మొత్తం 261మంది విద్యార్థులు పరీక్ష రాస్తే 46.13శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సీవోఈ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, లక్ష్మిప్రభ, సంధ్యరాణి, బిక్షమయ్య, రమేష్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకూ ఈ చలాన్లు

● చింతపల్లి ఎస్ఐ యాదయ్య

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ బీమా పత్రాలు, వాహన అనుమతి తదితర అన్ని పత్రాలు కలిగి ఉండాలని చింతపల్లి ఎస్ఐ యాదయ్య సూచించారు. లేనిపక్షంలో ఈ చలాన్ ద్వారా జరిమానాలు, శిక్షలు తప్పవని హెచ్చరించారు. గతంలో పట్టణ ప్రాంతాలకు మాత్రమే ఈ చలాన్ విధించేవారని, ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ విధానం అమల్లోకి వచ్చిందని తెలిపారు.

● చింతపల్లి, (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ చలాన్ విధిస్తారా ?

ఎస్ఐ: గతంలో పట్టణ ప్రాంతాలకు మాత్రమే ఈ చలాన్ విధించేవారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ విధానం అమల్లోకి వచ్చింది. ముఖ్యంగా ఆటోలు, గూడ్స్ వాహహనాలు, ద్విచక్ర వాహనదారులు నిబంధనలకు లోబడి వ్యవహరించకుంటే ఎక్కడ పడితే అక్కడ ఈ చలాన్ విధిస్తారు. ఈ చలాన్‌లో ఎలాంటి మినహాయింపులు ఉండవు. బీమా సౌకర్యం కలిగి ఉండాలి. మద్యం తాగి వాహనాలు నడపొద్దు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. ద్వాచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. రోడ్డు నియమ నిబంధనలు విధిగా పాటించాలి. లేని పక్షంలో శిక్ష పడుతుంది.

ఆంధ్రజ్యోతి: పాయింట్ల వారీగా ఎలా నమోదు చేస్తారు ?

ఎస్ఐ : వాహనానికి, వాహనదారునికీ బీమా సౌకర్యం లేకపోవడం, ద్విచక్ర వాహనదారుడైతే హెల్మెల్ ధరించకపోవడం, ఇతర వాహనాలకు సీటు బెల్టు ధరించకపోవడం, పరిమితికి మించి తాగి బండి నడపటం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇచ్చినప్పుడు ఇలా ఒక్కో దానికి ఒక్కో విధంగా పాయింట్లు ఉంటాయి. ఇలా 12 పాయింట్లు దాటితే వాహనదారుడు ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొరికితే ఆ పోలీస్‌స్టేషన్ పోలీసులు వెంటనే ఆ వాహనాన్ని సీజ్ చేస్తారు. ఆ వాహనాన్ని కోర్టు అనుమతితో తగిన జరిమానా చెల్లించి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

పోస్టర్ ఆవిష్కరణ

హాలియా, నవంబరు 21: నార్కట్‌పల్లిలో ఈనెల 24వ తేదీన నిర్వహించే యూటీఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ఆవిష్కరించారు. హాలియాలోని మండల వనరుల కేంద్రం గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమంలో టీఎస్ యూటీఎఫ్ కీలకంగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాసమళ్ల రమాదేవి, కరిముల వెంకట్‌రమణారెడ్డి, దాస వెంకన్న, సయ్యద్‌మియా, చింతపల్లి రవీందర్, సునీత, వెంకట్‌రాంరెడ్డి, ప్రసాద్, పాల్గొన్నారు.

విజయోత్సవాల కళాజాతా

మిర్యాలగూడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాల కళాజాతా నిర్వహించారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్, బాపూజీనగర్ తదితర కాలనీల్లో నిర్వహించిన కళాజాతాలో ప్రభుత్వ పథకాలను వివరించారు. ఏడాది కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని పాటల రూపంలో వర్ణించారు. కార్యక్రమంలో కళాకారులు రేవూరి వీరప్రతాప్, బందెల మల్లిక, మోగుదాల సైదమ్మ పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమిస్తే చర్యలు

రామగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రహదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించినా, నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు కాలనీల్లో ఆక్రమణకు గురైన ప్రాంతాలను తన సిబ్బందితో పరిశీలించారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మోక్షం కలిగేనా?



- మాండ్ర - నార్కట్‌పల్లి బీటీ రోడ్డు మరమ్మతులయ్యేనా..!
- ఎంఆర్ఆర్ కింద మంజూరైన రూ.82.50 లక్షలు
- ఎమ్మెల్యే చొరవ చూపాలంటున్న బాధితులు

నార్కట్‌పల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతిపాదనలు తయారై ఐదేళ్లు.. నిధులు మంజూరై రెండేళ్లు... శంకుస్థాపన జరిగి ఏడాది.. అయినా నేటికీ పనులు మాత్రం మొదలుపెట్టలేదు. ప్రజాప్రతినిధులు వేసిన శిలాఫలకం వెక్కిరిస్తుంది. ఇది నార్కట్‌పల్లి - మాండ్ర పీఆర్ రోడ్డు మరమ్మతుల ప్రగతి. ఎన్నికల ఇచ్చిన వాగ్దానమే తప్ప ఆచరణలో రోడ్డు మరమ్మతుల ఊసేలేదు. దీంతో రోడ్డుపై ప్రయాణించే వారి తిప్పలు తప్పడం లేదు. ఇదే మండలానికి చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు, భవనాల శాఖ మంత్రే అయినా మాకేందీ రోడ్డు గోసంటూ బాధిత గ్రామాల ప్రజలు ఆవేదన పడుతున్నారు. నార్కట్‌పల్లి నుంచి మాండ్ర గ్రామం వరకు సుమారు 5.5 కిలోమీటర్ల నిడివి గల పీఆర్ మట్టి రోడ్డును గతంలో ప్రధానిగా వాజపేయి ఉన్న హయాంలో పీఎంజీఎస్‌వై (ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం) కింద బీటీ రోడ్డుగా మార్చారు. కొన్నేళ్ల తర్వాత ప్రకృతి వైపరీత్యాలకు ఈ రోడ్డు దెబ్బతిన్నది. కంకర తేలి గుంతలమయమైన ఈ రోడ్డు మీదుగా ప్రయాణించటానికి సూర్యనగర్, మాండ్ర, కక్కిరేణి తదితర గ్రామాల ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. 5 కి.మీల నిడివిలో కనీసం 100 గుంతలకు పైనా ఉండటంతో ప్రయాణికు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బీటీ రెన్యూవల్‌కు రూ.82.50లక్షలు మంజూరు

ప్రకృతి వైపరీత్యాలకు ధ్వంసమైన ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని బాధిత గ్రామాల ప్రజలు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులను పలుమార్లు విజ్ఞప్తి చేశారు. పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేయగా వాటిని పరిశీలించేందుకు సుమారు ఐదేళ్లు పట్టింది. తదనంత రం ఎంఆర్ఆర్‌లో భాగంగా బీటీ రెన్యూవల్ కింద రూ.82.50లక్షలను మంజూరు చేశారు. 2023లోఅసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న స మయంలో ఈరోడ్డు మరమ్మతు పనులకు శం కుస్థాపన శిలాఫలకం వేశారు. అసెంబ్లీ ఎన్నిక ల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా కూడా మాండ్ర - నార్కట్‌పల్లి బీటీ రోడ్డు మరమ్మతు పనులు శిలాఫలకానికే పరిమితమయ్యాయి. బీటీ రెన్యూవల్ కింద మంజూరైన రోడ్డు మరమ్మతు పనులకు మంజూరైన రూ. 82.50 లక్ష ల నిధులు కల్వర్టులతో కూడిన మరమ్మతుల కు సరిపోవనే కారణంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ఆసక్తి చూపలేదని తెలిసింది.

జడ్పీ సమావేశంలో ప్రస్తావించా



నార్కట్‌పల్లి-మాండ్ర రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభం కాకపోవడంపై ఎంపీపీగా జడ్పీ సమావేశంలో ప్రస్తావించా. రోడ్డు మరమ్మతులకు పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు వేసిన అంచనా నిధులు సరిపోవనే విషయాన్ని సమావేశంలో లేవనెత్తా. అంచనా ప్రతిపాదనలను పునఃపరిశీలిస్తామని అధికారులు సమాధానమిచ్చారే తప్ప ఆచరణలో చూపలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఈ రోడ్డు సమస్యపై స్పందించి రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టేలా చొరవ చూపాలి.

- నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ,నార్కట్‌పల్లి

పురిటినొప్పులతో వెళ్తే ప్రసవమే



మాండ్ర నుంచి నార్కట్‌పల్లికి వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డుపై పురిటినొప్పులు పడుతున్న మహిళలు ప్రయాణిస్తే ఇక ప్రసవమే అనే మాదిరిగా రోడ్డు తయారైంది. ఈ సమస్యపై ఎన్ని సార్లు గ్రామస్థుల పక్షాన, బీజేపీ తరఫున విజ్ఞప్తి చేసినా పనులు మాత్రం శిలాఫలకానికే పరిమితమయ్యాయి. ప్రభుత్వంలోని పెద్దలు చొరవ చూపి మాండ్ర-నార్కట్‌పల్లి బీటీ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

శీనివాస్, మాండ్ర గ్రామస్థుడు

రూ.40లక్షలతో అదనపు ప్రతిపాదనలు

నార్కట్‌పల్లి-మాండ్ర బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు ఇంతకు ముందు మంజూరైన నిధులకు అదనంగా మరో రూ.40లక్షల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇందులో మెటల్ వేయడంతో పాటు రెండుచోట్ల కల్వర్టుల నిర్మాణం పనులను పొందుపరిచాం. ఇంకా మంజూరు కాలేదు.గతంలో మంజూరైన నిధుల మేరకైనా పనులు మొదలుపెట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరాం.



- రమేష్, పీఆర్ డీఈఈ

మాల, మాల ఉద్యోగుల

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లకుమాల మధుబాబు

నల్లగొండటౌన్, నల్లగొండ క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న మాల, మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు అన్నారు. మాలమహానాడు జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఈవో ఆఫీస్ దగ్గర గల అంబేడ్కర్ విగ్రహం నుంచి సభ వరకు వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. మాలలు, మాల ఉద్యోగులు అందరూ తప్పక హాజరై ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజులతో పాటు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ జి.చెన్నయ్య, రాష్ట్ర కన్వీనర్ సర్వయ్య, రాష్ట్ర కమిటీ కో చైర్మన్లు తాళ్లపల్లి రవి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్నమల్ల అనిల్, నాయకులు చింతపల్లి బాలకృష్ణ, అద్దంకి రవీందర్, నంద యాదగిరి, నామ చక్రవర్తి, అంగరాజు, స్వర్ణలత, అనిమల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కనగల్ చెరువులో చేపపిల్లలను వదులుతున్న శ్రీనివాస్‌గౌడ్

కనగల్, నవంబరు 21: (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి అన్నారు. ఏఎమ్మార్పీ కాల్వ నుంచి లిఫ్ట్ ద్వారా పొనుగోడు చెరువుకు నీటిని తరలించేందుకు రూ.6.83 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గురువారం కనగల్, పొనుగోడు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్, అనూప్‌రెడ్డి మాట్లాడుతూ పొనుగోడు చెరువు నిండితే మండలంలోని అన్ని చెరువులకు సాగర్ నీరందినట్లేనని అన్నారు.

● మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా సరఫరా చేసిన 4.9 లక్షల చేపపిల్లలను గురువారం కనగల్ మైలసముద్రం చెరువులో ఆయన వదిలారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు మెరుగు శివయ్య, నర్సింగ్ సునీతకృష్ణయ్యగౌడ్, యాకాలపు లక్ష్మయ్య, నాయకులు సింగం పెద్దులు, కరీంముల్లా, నల్లబోతు శ్రీను, కొమ్మగాని వెంకన్న, వెంకటేశం, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, సింగం పెద్దులు, ఏఎంసీ డైరెక్టర్ ఎస్‌కె.కరీంముల్లా, నక్క వెంకటేశం, మోహన్, యాదగిరి, నరహరి, పెద్దులు, కొమ్మగోని వెంకన్న, రవి, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

శాంతిభద్రత పరిరక్షణకు కృషి చేయాలి : డీఎస్పీ



పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మాడ్గులపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. పెండింగ్‌లో కేసులు లేకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది ఉన్నారు.

బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలి

మిర్యాలగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలని ముదిరాజ్ మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా సైదులు డిమాండ్ చేశారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ చైతన్య జెండా ఆవిష్కరించారు. అభయహస్తంలో పేర్కొన్న ప్రకారం ముదిరాజ్, ముత్తరాశి, తెనుగోలు కులాలను బీసీ డీ నుంచి బీసీ ఏ లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి అవధారపు మురళి, నాయకులు బంటు సైదులు, దాసరాజు జయరాజు, బంటు దుర్గయ్య, వెంకయ్య, నాగరాజు, సైదులు పాల్గొన్నారు.

కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదా



మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడింది. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు కమిషనర్ యూసుఫ్ ప్రకటించారు. సమావేశానికి హాజరు కాని కాంగ్రెస్ కౌన్సిలర్లు స్థానిక నాయకులతో కలిసి చైర్మన్‌కు వ్యతిరేకంగా కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. పదేళ్ల పాటు పట్టణాన్ని పరిపాలించిన చైర్మన్ భార్గవ్ సమాచార హక్కు కింద కార్యాలయంలో వివరాలు అడగడం, కమిషనర్‌కు లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, చిలుకూరి బాలు, జయలక్ష్మి, నాగలక్ష్మి, రామకృష్ణ, శేఖర్ రెడ్డి, రుణాల్‌రెడ్డి, జానీ, అమృతారెడ్డి, సైదులు, సలీం, సిద్దు, గోవర్ధనాచారి, అనిత పాల్గొన్నారు.

● దురుద్దేశంతోనే తనపై ఆరోపణలు చేస్తున్నారనిమునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పదవులపై ఆశతో రాజకీయాల్లోకి రాలేదన్నారు. అవినీతికి, అక్రమాలకు పాల్పడితే విచారణ జరిపించాలన్నారు. అక్రమాల నుంచి దృష్టి మరల్చేందుకే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

● కౌన్సిల్ సమావేశాన్ని అధికార పార్టీ కౌన్సిలర్లు బహిష్కరించడం సరికాదని బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చిలుకూరి రమాశ్యాం అన్నారు.

సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



నల్లగొండ: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

కట్టంగూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్స్ ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి ఆదేశించారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్యూమరేటర్లు సేకరించిన సమాచారాన్ని త ప్పులు లేకుండా వేగంగా 10 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రతి కాలాన్ని ఎం ట్రీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్ రావు, ఎంఈవో అంబటి అంజయ్య ఎంపీవో చలపతి, ఎంపీఎస్‌వో శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ సట్టు గోపి తదితరులు పాల్గొన్నారు.

పూర్తికావొచ్చినా కుటుంబ సర్వే

రామగిరి: నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే దాదాపుగా పూర్తి కావొచ్చింది. నల్లగొండ పట్టణంలో 47,524 గృహాలు ఉండగా 44,747 గృహాల సర్వే పూర్తయింది. ఇక మిగిలిన 2,777 సర్వే రెండు మూడు రోజుల్లో పూర్తి కానున్నట్లు మునిసిపల్ అధికారులు పేర్కొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డాటా ఎంట్రీపై ఆర్డీవో అశోక్‌రెడ్డి, ము నిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ శిక్షణ ఇచ్చారు. సర్వే వివరాలు జా గ్రత్తగా తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యూమనేటర్లకు సూచించారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



కొండమల్లేపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌మాదిగ

తిప్పర్తి, శాలిగౌరారం, కొండమల్లేపల్లి, నవంబరు 21 ఆంధ్రజ్యోతి: నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఈ నెల 23వ తేదీన జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. గురువారం జిల్లాలోని తిప్పర్తి, శాలిగౌరారం, కొండమల్లేపల్లి మండలాల్లో సంఘం ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయనందుకు నిరసనగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనంతో మాదిగ, మాదిగ ఉపకులాల సత్తా చాటుతామని అన్నారు.

● తిప్పర్తి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మాదిగల యూత్, నాయకుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు బీఆర్ఎస్ నాయకులు కందుల లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ కిన్నెర అంజి, కొమ్ముగిరి మాదిగ, జేఏసీ చైర్మన్ కత్తుల జగన్‌కుమార్, వైస్ చైర్మన్ తులసీదాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య మాట్లాడారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు సిరిపంగి రాములు, నరిగ నరసింహ, చింత ధనుంజయ, బట్ట శ్రీనివాస్, అంబేడ్కర్, జనార్ధన్, పరశురాములు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి అతిథిగృహంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్ మాదిగ మాట్లాడారు. మండల నాయకుడు అందుగుల తిరుపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కురుమేటి వెంకటగరమణమాదిగ, ఆదిరాల రమేష్, వస్కుల విజయ్, లింగం, అందుగుల సైదులు, ముదిగొండ నరేందర్, క్రాంతికుమార్, గుణ, ప్రసాద్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీ ప్రాధాన్యమివ్వాలి

పెద్దఅడిశర్లపల్లి: ఇందిరమ్మ కమిటీ తొలి ప్రాధాన్యత దళితులకు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీ తొలి ప్రాధాన్యత దళితులకే ఇవ్వాలని, దళితవాడలో సీసీ రోడ్లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్, వెంకటయ్య, శ్రీనయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి: మిర్యాలగూడలో డిసెంబరు 2,3,4 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా 21వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య కోరారు. మండలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు చిన్నపాక లక్ష్మీనారాయణ, ఆనంద్, మండల కార్యదర్శి రమావత్ లక్ష్మణ్‌నాయక్, సుజాత పాల్గొన్నారు.

'ధరణి' లీలలు కోకొల్లలు

(5 వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ కానిచ్చారు. అయితే సదరు భాగస్వాములు ఆ తర్వాత తాము ఈ రిజిస్ట్రేషన్‌కు అంగీకరించలేదని, ఇది ఫేక్ రిజిస్ట్రేషన్ అని తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు రిజిస్ట్రేషన్లే గాక ఇటీవల గుట్టకింది అన్నారానికి చెందిన ఇలాంటి వ్యవహారంతో పాటు, తాజాగా సూరారంలో ఏకంగా వృద్ధురాలికి చెందిన కోట్లాది రూపాయల విలువైన భూమిని కాజేసేందుకు చేసిన మోసం కూడా బయట పడింది. మొత్తంగా హాట్ సెంటర్‌గా మారిన నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి రిజిస్ట్రేషన్ల తప్పులు ఒక్కోటి వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ కార్యాలయంలో ధరణి రిజిస్ట్రేషన్లన్నింటినీ క్రమబద్ధీకరించాలని, సజావుగా సాగేలా పటిష్టమైన యంత్రాంగాన్ని నెలకొల్పడంతో పాటు, వస్తున్న ఫిర్యాదులపైనా కఠినచర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు సహకరించిన అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదులపై విచారణ నిర్వహిస్తాం

ధరణి రిజిస్ట్రేషన్లపై వస్తున్న ఆరోపణలు, ఫిర్యాదులపై విచారణ కొనసాగిస్తున్నాం. ఫిర్యాదులు చేస్తున్నవారు వారే స్వయంగా రిజిస్ట్రేషన్‌కు వచ్చి అంగీకరిస్తూ సంతకాలు చేస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆధార్ కార్డులు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు ఉంటేనే సక్సేషన్ జరుగుతుంది. ఫిర్యాదులపై ఇరుపార్టీలను పిలిచి విచారిస్తాం. అప్పటికీ ఎవరి వాదనకు వారు కట్టుబడి ఉంటే, ఫోరెన్సిక్‌ల్యాబ్‌కి పంపి నిర్ధారణ చేయిస్తాం. ఆపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్, తహసీల్దార్, నల్లగొండ

మత్స్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నకిరేకల్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

హాలియా, నకిరేకల్, కట్టంగూరు, నవంబరు 21: ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు మత్స్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిడిగం నాగయ్య ముదిరాజ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా చైర్మన్ కనుకు వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి మురారి మోహన్ డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం, ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గురువారం హాలియా, నకిరేకల్, కట్టంగూరులో సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్‌ల అభివృద్ధి, హక్కులు సాధించడం జాతి అభ్యున్నతి కోసం తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఏర్పడి పదేళ్లు అయినట్లు తెలిపారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేరవేర్చాలని డిమాండ్ చేశారు. మత్స్య సొసైటీ సభ్యులందరికి రూ.10లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ ఎలాంటి షరతులు లేకుండా అందించాలన్నారు. హాలియాలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు యలకాని వెంకటేశ్వర్లు, పుట్టా దుర్గారావు, నాశబోయిన వెంకటేశ్వర్లు, లింగంపల్లి శ్రీనివాస్, సైదులు, మంగయ్య, లక్ష్మీనారాయణ, నకిరేకల్‌లో నక్క రాంభనేష్, దాసరి భిక్షపతి, నిదుర రమేష్, వేణుకుమార్, బండారి బాలకృష్ణ, నాగరాజు, కట్టంగూరులో మత్స్య సొసైటీ జిల్లా డైరెక్టర్ తవిడబోయిన అజయ్‌కుమార్, గుడిసె రమేష్, తవిటి నాగార్జున, నార్ల యాదయ్య, నార్ల సత్యనారారయణ, తిరుమలేష్, శివకృష్ణ, నగేష్, రామకృష్ణ, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెద్దవూర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్మగూడెం, పెద్దవూర సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు జరుగుతున్నందున శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఏఈ దాసయ్య తెలిపారు. వెల్మగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదేవిధంగా పెద్దవూర సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

● శాలిగౌరారంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జి.శ్రీధర్ తెలిపారు. మండలంలోని శాలిగౌరారం, ఉట్కూర్, పెర్క కొండారం, గురజాల, అంబారిపేట, తుడిమిడి, ఆకారం, అడ్లూర్ తదితర ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, పీఏపల్లి, చండూరురూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిట్యాల, పెద్దఅడిశర్లపల్లి, చండూరు మండలాల యూటీఎఫ్ కమిటీలను ఎన్నుకున్నారు. ఆయా మండలాల్లో గురువారం నిర్వహించిన సమావేశాల్లో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఏశమల్ల నాగయ్య

● చిట్యాల మండల అధ్యక్షుడిగా ఏశమల్ల నాగయ్య, ప్రధాన కార్యదర్శిగా గడగోజు సతీష్, ఉపాధ్యక్షులు రంగా రామలింగయ్య, జానకి, కోశాధికారి చంద్రశేఖర్, కార్యదర్శులను ఎన్నుకున్నారు.



పీఏపల్లి అధ్యక్ష, కార్యదర్శులు జీవన్‌కుమార్, సురేష్

● పీఏపల్లి, గుడిపల్లి మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని అక్కంపల్లి పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. యూటీఎఫ్ పీఏపల్లి మండల అధ్యక్షుడిగా పి.జీవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.సురేష్ ఎన్నుకున్నారు. అదేవిధంగా గుడిపల్లి మండల అధ్యక్షుడిగా సిహెచ్.వెంకటయ్య, ప్రధానకార్యదర్శి బి.జైపాల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నార్కట్‌పల్లిలో 24వ తేదీన జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.



నాంపల్లి సైదులు, గంగాధర్

● చండూరు యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా నాంపల్లి సైదులు, ప్రధాన కార్యదర్శి పెండెం గంగాధర్, ఉపాధ్యక్షులు బొమ్మరబోయిన సైదులు, కత్తుల మమత, కోశాధికారిగా రావిరాల రమేష్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎంఈవో ఊటుకూరి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు రామలింగయ్య, నరసింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైదులుకు ఓయూ డాక్టరేట్



సైదులు యాదవ్

నల్లగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుముల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఇసురాజు సైదులుయాదవ్‌కు ఓయూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆర్ట్స్ కళాశాల తెలుగు డిపార్ట్‌మెంట్‌కు చెందిన సైదులు 'తెలంగాణ నవలలు, వస్తు వైవిధ్యం' అనే అంశంపై పరిశోధన చేశారు. తెలుగు ఆచార్యులు నసుమాన స్వామి పర్యవేక్షణలో ఈ పరిశోధన కొనసాగింది. తనకు పీహెచ్‌డీ పట్టా రావడంపై సైదులుయాదవ్ ఆనందం వ్యక్తం చేశారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేయడం గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో సాధించాలి

చింతపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించినప్పుడే తగిన గుర్తింపు ఉంటుందని ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధీర్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని వేంకటేశ్వరనగర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంపికైంది. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. నల్లగొండలో ఈ నెల 28న నిర్వహించే వైజ్ఞానిక పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన చరణ్, రితి, సన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం ఎండి.అన్వర్, నరసింహ, మోతీలాల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

డిండి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకచారి అన్నారు. కామేపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా రేషన్‌కార్డులు జారీకాక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దేవరకొండలో డిసెంబరు 26న భారీ కవాతు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మయ్య, పొల్లే శైలేజ్, నూనె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.